క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాండూరు టౌన్: విద్యుత్ ఉప కేంద్రాల్లో మరమ్మతుల కారణంగా రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు డీఈ భాను ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి 9 వరకు బంట్వారం మండలం తుర్‌మామిడి, బంట్వారం, మర్పల్లి మండలం కల్కోడ్, పెద్దేముల్ మండలం గాజీపూర్, ఇందూర్, తట్టేపల్లి, మంబాపూర్, తాండూరు పరిధి ఎన్టీఆర్‌నగర్, అంతారం, రాజీవ్ గృహకల్ప, హైదరాబాద్ రోడ్డు మార్గంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని వెల్లడించారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని డీఈ కోరారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతు, తదితర ప్రాంతాల్లో ట్రీ కటింగ్ కారణంగా అల్లాపూర్ ఫీడర్ కింద ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ మహిపాల్ తెలిపారు. బుధవారం ఉదయం 8గంటల నుంచి 11 వరకు సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



నర్సింహారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బీఎమ్మార్

పెద్దేముల్: గాజీపూర్ గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి బుధవారం ఆయనను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి, వైద్య చికిత్సపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. బాధిత కుటుంబ సభ్యులతో మట్లాడుతూ.. అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయనతో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రుద్రారం మైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.


అందుబాటులో రాయితీ విత్తనాలు

ధారూరు: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కేంద్రంలో సబ్సిడీతో కూడిన జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనుము విత్తనాలు కిలో పూర్తి ధర రూ.90.50 పైసలు కాగా.. సబ్సిడీ రూ.54.30 పైసలు పోను, 40 కిలోల బస్తాకు రూ.1,448 చెల్లించి తీసుకోవాల్సి ఉంటుందని చైర్మన్ సూచించారు. అదే విధంగా జీలుగ విత్తనాలకు కిలోకు రూ.93 కాగా సబ్సిడీ రూ.55.80 పైసలు పోను కిలోకు రూ.37.20 పైసల చొప్పున 30 కిలోల బస్తాకు రూ.1,116లు చెల్లించి తీసుకోవాలని పేర్కొన్నారు. సబ్సిడీ విత్తనాలు తీసుకునే రైతులు.. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను తీసుకెళ్లి సంబంధిత ఏఈఓల ద్వారా పర్మిట్ తీసుకుని, విత్తనాలు పొందాలని వెల్లడించారు. డీఏపీ ఎరువు అందుబాటులో ఉందని, కావాల్సిన వారు తీసుకోవాలన్నారు.

కష్టపడితే ఏదైనా సాధ్యమే

అనంతగిరి: కష్టపడితే ఏదైనా సాధ్యమేనని విశ్రాంత అధ్యాపకుడు బందెప్పగౌడ్ అన్నారు. వికారాబాద్ పట్టణంలోని సత్యసాయి జ్ఞానకేంద్రంలో నెల రోజులుగా కొనసాగిన పాలిసెట్ ఉచిత కోచింగ్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా బందెప్ప మాట్లాడారు. వ్యక్తిత్వ విలువలు కలిగి ఉండి, సత్‌ప్రవర్తన, క్రమశిక్షణతో లక్ష్యాన్ని చేరుకోవచ్చునని సూచించారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ, ఉన్నత స్థాయికి ఎదగాలని చెప్పారు. కార్యక్రమంలో జ్ఞానకేంద్రం కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణగౌడ్, ప్రతినిధులు బసవేశ్వర్, వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్, ప్రేంకుమార్ ముత్యం శ్రీనివాస్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పొంచివున్న ప్రమాదం



పొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభాలు

దోమ: సాగు భూములు, పొలాలకు వెళ్లే మార్గంలోని విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. మండల పరిధి మోత్కూర్ గ్రామ సమీపంలోని సాగు భూముల్లో స్తంభాలు ఒకవైపు ఒరిగి ఉండటం రైతులను కలవరపాటుకు గురిచేస్తోంది. ప్రస్తుతం ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అవి నేలకూలినా, తీగలు తెగి పడినా రైతులు, మూగజీవాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. స్తంభాలను సరిచేయాలని పలుమార్లు విద్యుత్ అధికారులను కోరామని, అయినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు.

‘శివసాగర్’కు మోక్షం కలిగేనా?

పూర్తయిన కాలువల సర్వే, హద్దులు

- కొనసాగని నిర్మాణ పనులు
- రెండు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ప్రజలు, ఆయకట్టు రైతులు

కాకరవేణి నదిపై నిర్మాణంలో ఉన్న శివసాగర్ ప్రాజెక్టు కోసం ఆయకట్టు రైతులు సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్నారు. జలాశయ పనులు ప్రారంభించి సుమారు 19 ఏళ్లు గడిచినా.. నేటికీ పూర్తికాలేదు. కాలువల పనులు చేపట్టేందుకు అధికారులు.. కాలువల అలైన్‌మెంట్ ఏరియాను గుర్తించి, హద్దులు సైతం నిర్ణయించారు. అయినప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్న చందంగా మారింది.

యాలాల: జలయజ్ఞంలో భాగంగా మండల పరిధి విశ్వనాథ్‌పూర్ సమీపంలో కాకరవేణి నదిపై శివసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి 2005 ఆగస్టు 4న నాటి సీఎం, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి అంకురార్పణ చేశారు. ఈ ప్రాజెక్టు సామర్థ్యం పది అడుగుల నీటిమట్టం, వెయ్యి ఎకరాలకు సాగునీటిని అందించనుంది. నాటి నుంచి కాలువల నిర్మాణపు పనులు పూర్తి కాకపోవడంతో ప్రాంత రైతులు జలాశయం కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు.



శివసాగర్‌లో జలకళ

పెరిగిన వ్యయం

రూ.5 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు కరకట్ట, తూముల నిర్మాణం, అలుగు, కాల్వలతో జలాశయం పనులు నాడు ప్రారంభించారు. కాలక్రమేనా నాసిరకమైన పనుల కారణంగా శివసాగర్ ఎడమ కాల్వ తూము ఏడేళ్ల క్రితం భారీ వరదలకు కొట్టుకుపోయింది. అలుగు ప్రాంతం దెబ్బతిని, రెవిట్‌మెంట్, బెడ్లు దెబ్బతిని భూమి కోతకు గురైంది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.12 కోట్లకు చేరింది. ప్రస్తుతం అలుగు పని పూర్తి కాగా.. కాల్వలు, తూముల నిర్మాణాలు మిగిలిపోయాయి.

అలైన్‌మెంట్ కేటాయింపు

ప్రాజెక్టు సామర్థ్యం వెయ్యి ఎకరాలకు పైగా ఉంది. ఆయకట్టు కింద విశ్వనాథ్‌పూర్, యాలాల, గోవిం



పూర్తయిన అలుగు ప్రాంతం

దరావుపేట, సంగెంకుర్దు, రాఘవపూర్, కమాల్‌పూర్, కోకట్ తదితర గ్రామాల సాగు భూములకు నీరందనుంది. ఎడమ కాలువ 4 కిలో మీటర్ల మేర నిర్మించనుండగా, కుడి కాలువ 3 కిలో మీటర్ల మేర చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన అలైన్‌మెంట్ సైతం అధికారులు సిద్ధం చేశారు. కాలువల నిర్మాణంతో పాటు గతంలో కొట్టుకుపోయిన తూము పునఃనిర్మాణ పనులు, కాలువల నిర్మాణాన్ని చేపట్టనున్నారు.

అందని ద్రాక్షే



జలాశయం ఇక్కడి రైతులకు అందని ద్రాక్షగా మారింది. సుదీర్ఘకాలంగా ప్రాజెక్టు నిర్మాణ పనులు కొనసాగడం నిరాశను మిగుల్చుతోంది. ప్రాజెక్టు ఆయకట్టు కింద బోర్ల ద్వారా పంటలు సాగు చేసుకుంటున్నాము. అధికారులు ఈ సారైనా కాలువల నిర్మాణ పనులు ప్రారంభించి, పూర్తి చేయించాలి.

–అశోక్, ఆయకట్టు రైతు, యాలాల

త్వరలో ప్రారంభం



శివసాగర్ ప్రాజెక్టు కాలువ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. అలుగు ప్రాంతంలో ఉన్న కొంత పనులను ఇప్పటికే ప్రారంభించాం. కాలువ పనులకు సంబంధించి అలైన్‌మెంట్ సర్వే పూర్తయింది. నిర్మాణదారులు పనులు వేగంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాము.

– కిష్టయ్య, ఇరిగేషన్ డీఈఈ, తాండూరు

తండాల్లో కరెంట్ కష్టాలు



సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజనులు

- పట్టించుకోని అధికారులు
- ఆందోళన వ్యక్తంచేసిన గిరిజనులు

కుల్కచర్ల: ‘కరెంటోళ్లు తమ గోడును పట్టించుకోవడం లేదు’ అని ఘణాపూర్ గ్రామపంచాయతీ పరిధి సుబ్యానాయక్‌తండా, గోప్యానాయక్ తండా, సక్ర్యానాయక్‌తండా వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ మాట్లాడారు. తండాల్లో ప్రస్తుతం దూరం దూరంగా విద్యుత్ స్తంభాలు ఉండి, తీగలు కిందకు వేలాడుతున్నాయని తెలిపారు. గాలి వానలకు చెట్లు విరిగి, వైర్లు తెగిపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. కనీసం నిరుపేద విద్యార్థులు చదువుకునే పాఠశాలలకు విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వడం లేదని వాపోయారు. ఐదేళ్లుగా ఈ సమస్యలను ట్రాన్స్‌కో అధికారులకు చెప్పినా.. పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఘణాపూర్ అనుబంధ గ్రామాలన్నింటికి పుట్టపహాడ్ ఫీడర్ నుంచి కాకుండా.. బండవెల్కిచర్ల ఫీడర్ నుంచి లైన్ వేసి, విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని గిరిజనులు కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఏఈ సాయి కృష్ణకు వినతి పత్రం అందజేశారు.

పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలి

చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య కిష్టఫర్

మొయినాబాద్ రూరల్: పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య కిష్టఫర్ తెలిపారు. బుధవారం రంగారెడ్డి జిల్లా హిమాయత్‌నగర్ సమీపంలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో వాణిజ్య, వ్యాపార నిర్వహణ విభాగంలో ఎమర్జింగ్ ట్రేడ్స్ ఇన్ మెచిర్యూల్ ఫండ్స్ విజ్ ఏ ఇన్వెస్టర్స్ పర్సెప్షన్ ఏ సెలక్ట్ స్టడీ అనే అంశంపై డాక్టర్ కె.వెంకటజనార్దన్‌రావు పర్యవేక్షణలో ఆవుల సునీత పరిశోధనను పూర్తి చేశారు. దీంతో ఆమెకు బుధవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ మాట్లాడారు. సమాజం అభివృద్ధి వైపు ఉన్నప్పుడే ప్రజల ద్వారా ఈ పరిశోధనలకు గుర్తింపు లభిస్తుందన్నారు. సునీత చేసిన పరిశోధన ప్రస్తుత కాలంలో వాణిజ్యం, వ్యాపార నిర్వహణ, కొనుగోలు, అమ్మకం వంటి వాటికి సంబంధించిందని, అది ఎంతో బాగుందని ఆమెను అభినందించారు. ఇందులో యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సాత్వికరెడ్డి, రిజిస్ట్రార్ రవీందర్, జగదీశ్వర్, రాజు, పబ్లిక్ రిలేషన్ అధికారి గాదే రాంబాబు ఉన్నారు.



డాక్టరేట్ ప్రదానం చేస్తున్న కిష్టఫర్ తదితరులు

నేటి నుంచి పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

షాబాద్ మండల వ్యవసాయాధికారి

షాబాద్: పచ్చిరొట్ట విత్తనాలు జనుము, జీలుగ రైతులకు గురువారం నుంచి అందుబాటులో ఉంటాయని రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల వ్యవసాయ అధికారి వెంకటేశం తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 60శాతం సబ్సిడీపై షాబాద్ సహకార బ్యాంకు వద్ద పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జనుము 40 కిలోల బస్తా సబ్సిడీ పోను రూ.1,448లు, జీలుగ 30 కిలోల బస్తా రూ.1,116లు రైతులు చెల్లించాలన్నారు. అవసరం ఉన్న రైతులు పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని విత్తనాలు తీసుకోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

షాద్‌నగర్‌లో..

షాద్‌నగర్: రాయితీపై విత్తనాలు సరఫరా చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి నిశాంత్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ షాద్‌నగర్‌లో ఆగ్రో రైతు సేవా కేంద్రంలో రైతులకు ప్రభుత్వం నుంచి 60శాతం రాయితీపై జనుము, జీలుగ, పచ్చిరొట్టె విత్తనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు అవసరం ఉన్న అన్నదాతలు తమ పట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులతో వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నందిగామలో..

నందిగామ: మండల పరిధి మేకగూడ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కేంద్రంలో సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ సీఈఓ వినయ్ కుమార్ తెలిపారు. జనుము 40కిలోల బస్తా రూ.1,448లు, జీలుగ 30 కిలోల బస్తా రూ. 1,116లు చెల్లించి తీసుకెళ్లాలన్నారు. ఒక ఎకరానికి ఒక బ్యాగ్ సరిపోతుందని చెప్పారు. కావల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు తీసుకొని పీఏసీఎస్‌ను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

మాడ్గుల: మండలంలోని అర్కపల్లిలో గల ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ బుధవారం గ్రామస్తులు మాడ్గుల తహసీల్దార్ సునీల్‌కు వినతి పత్రం అందజేశారు. తమ పంచాయతీ పరిధిలో చెరువు, కుంటలను కొందరు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. విచారణ చేసి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతి, రాంకిషన్, గిరి, రామకష్ణ, నరేష్, మహేందర్ ఉన్నారు.

ఎమ్మెల్యే పర్యటన నేడు

కుల్కచర్ల: బండవెల్కిచర్ల పరిధి పాంబండ రామలింగేశ్వర క్షేత్రంలో గురువారం నిర్వహించే గిరిప్రదక్షిణ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొననున్నారని కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి పౌర్ణమికి ఆలయంలో గిరిప్రదక్షిణ జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిటీ కోరింది.

వైభవంగా నృసింహుడి జాతర షురూ



ఆలయంలో భక్తుల పూజలు

పూడూరు: మండల పరిధి రాకంచర్ల యోగానందా లక్ష్మీనర్సింహాస్వామి జాతర బుధవారం వైభవంగా ప్రారంభమయింది. తొలిరోజు అఖండ దీపారాధన, ధ్వజారోహనం, నర్సింహాస్వామి జయంతిని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కమ్లీబాయి, పెంటయ్య కార్యక్రమం నిర్వహించారు. గురువారం సాయంత్రం స్వామి వారి కల్యాణం జరగనుందని ఆలయ కమిటీ తెలిపింది.

భారీ మెజార్టీతో రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయం

మోమిన్‌పేట: లోక్‌సభ ఎన్నికల్లో చేవేళ్ల పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. అదే సంతోషంతో రంజిత్‌కు ప్రజలు అండగా నిలిచి, భారీగా మద్దతు తెలిపారని వెల్లడించారు.

ఆశ్రమ నిర్మాణానికి భూమిపూజ

తాండూరు రూరల్: మండల పరిధి కరన్‌కోట్ శివారులో మల్లికార్జున అప్పాజీ (ముత్తా) పేరుతో వృద్ధాశ్రమ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన అప్పాజీకి తాండూరులో పెద్ద ఎత్తున భక్తులు ఉన్నారు. కరన్‌కోట్ శివారులో వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి, వృద్ధులకు ఆసరాగా నిలవాలని భావిస్తున్నట్లు భక్తుడు సిద్రాల శ్రీనివాస్ తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

కొందుర్గు: మండలంలోని ముట్పూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్లకు చెందిన మహేందర్ రెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 320 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు అంజయ్య, శ్రీశైలం, రమేశ్, నరేందర్, శివ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్త!

- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- దుకాణదారులు నిబంధనలు పాటించాలి
- వ్యవసాయ అధికారి వెంకటేశం



షాబాద్: వానాకాలం సీజన్ ప్రారంభంలో వివిధ రకాల విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల వ్యవసాయ అధికారి వెంకటేశం సూచించారు. విత్తనాలు, ఎరువులు, కొనుగోళ్లలో తగిన అప్రమత్తత అవసరమని ఆయన చెప్పారు. విత్తనాల కొనుగోలు సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దుకాణదారులు పాటించాల్సిన నిబంధనలను వివరించారు. విత్తన విక్రేతల దుకాణాలపై నిఘా ఉంచామని తెలిపారు. ఆకస్మిక తనిఖీలు చేసి, రికార్డులు పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. విక్రేతలతో మాట్లాడి నిబంధనలు కచ్చితంగా పాటించాలని తేడాలు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు దుకాణం నుంచి బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. రసీదును భద్రపర్చుకోవాలి.
- ప్రభుత్వ అనుమతులు ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- బిల్లులపై విత్తన సంస్థల నంబర్, తయారీ తేదీ, గడువు తేదీలు సరిగా ఉన్నాయో లేవో సరిచూసుకోవాలి.
- బిల్లులపై దుకాణం ముద్ర ఉండేలా చూడాలి. విత్తనాల మొలక శాతం, తేమ శాతం కచ్చితంగా దుకాణదారులను అడగాలి.
- విత్తన సంచులు చిరిగినా, రంధ్రాలున్నా, తడిసినా కొనుగోలు చేయొద్దు. విత్తన ప్యాకెట్లు నిల్వ ఉంచినప్పుడు తేమశాతం చూసుకోవాలి.
- విత్తన సంచులపై ప్రామాణికాలు, ఉత్పత్తిదారుల వివరాలు ఉన్నాయో? లేవో? చూసి కొనాలి.



షాబాద్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు, మందులు

దుకాణదారులు పాటించాల్సిన నిబంధనలు..

- దుకాణం ఎదుట ధరల వివరాలు బోర్డుపై పొందుపరచాలి.
- అక్కడ లభించే విత్తనాలు, రకాలను డీలర్ల వివరాలు పేర్కొనాలి.
- దుకాణం లైసెన్స్ వినియోగదారులకు కనిపించేలా ఉంచాలి. స్టాక్ రిజిస్టర్లు, విత్తనాల వివరాల బుక్స్ రిజిస్టర్ నిర్వహించాలి.
- విత్తనాలు, ఎరువుల విక్రయాలు, కంపెనీల పూర్తి వివరాలన్నీ నిత్యం వ్యవసాయశాఖకు తెలపాలి.

వ్యాధి నివారణకు టీకా తప్పనిసరి

రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: పశుసంపదను కాపాడుకునేందుకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వాటికి వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. బుధవారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధి మద్దూరు గ్రామంలో పశువులకు గొంతువాపు వ్యాధి, తొడవాపు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గొర్రెలకు, మేకలకు చిటుక వ్యాధి సోకకుండా టీకాలు తప్పనిసరిగా ఇప్పించాలని పెంపకందారులకు తెలిపారు. జీవాలు అనారోగ్యానికి గురికాకుండా ప్రభుత్వం ఏడాదిలో రెండు విడతలు చిటుక వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: పశువులు, మేకలు, గొర్రెల పెంపకంలో కాపరులు, రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి స్ఫూర్తి సూచించారు. మండల పరిధి ఇన్ముల్‌నర్వ గ్రామంలో 300 పశువులకు గొంతువాపు, పెంజర్ల గ్రామంలో గొర్రెలు, మేకలకు చిటుక వాపు నివారణ టీకాలను వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడం వలన పశువులు, మేకలు, గొర్రెలు అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. పశువులు రోగాల బారిన పడితే ఆలస్యం చేయకుండా చికిత్స చేయించాలని చెప్పారు. ముఖ్యంగా వీటి పెంపకంలో రైతులు, కాపరులు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణ, సులేమాన్, రవిరాజు, రైతులు పాల్గొన్నారు.



షాబాద్: టీకా వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం

ఉద్యానశాఖ షాద్‌నగర్ డివిజన్ అధికారి ఉషారాణి

కేశంపేట: ఆయిల్‌పామ్ సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని ఉద్యానశాఖ షాద్‌నగర్ డివిజన్ అధికారి ఉషారాణి తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుపై మండల పరిధి లేమామిడి గ్రామంలోని రైతువేదికలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అధికారి ఉషారాణి మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తే మొక్కకు 90%, డ్రిప్ పైన 100% సబ్సిడీ, అలాగే మొక్కల మెయింటెనెన్స్‌కు ఎకరానికి రూ.4,200లు అందిస్తారని తెలిపారు. ఎకరానికి 10 నుంచి 15 టన్నుల వరకు దిగుబడి వస్తుందని వెల్లడించారు. రైతులు పండించిన పంటలను ఆయిల్‌పామ్ కంపెనీ వారే కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. పంటల సాగులో చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని, ప్రభుత్వం ఇచ్చే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని రైతులకు సూచించారు. అనంతరం ఆయిల్‌పామ్ సాగుపై కరపత్రాన్ని ఆవిష్కరించారు. షాద్‌నగర్ ఏడీఏ రాజరాత్నం, అయిల్‌పామ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్, జిల్లా ఏరియా మేనేజర్ ప్రమోద్, మండల వ్యవసాయ అధికారి శిరీష, ఉద్యానశాఖ ఫీల్డ్ అధికారి రుక్మిణి, వ్యవసాయ విస్తరణ అధికారులు సుధా, సమీరా, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఉషారాణి

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

పంచాయతీ కార్యదర్శి సంధ్య

మొయినాబాద్ రూరల్: పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని పంచాయతీ కార్యదర్శి సంధ్య అన్నారు. హిమాయత్‌నగర్ రెవెన్యూ గ్రామ పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్కన ఉన్న హోటల్స్ తదితర వ్యాపారులు రోడ్ల పక్కన చెత్తాచెదారం వేస్తే ఫెనాల్టీ విధిస్తామని ఆమె హెచ్చరించారు. బుధవారం రంగారెడ్డి జిల్లా మండల పరిధి హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధి గండిపేట చౌరస్తా, హిమాయత్‌నగర్ వరకు సంధ్య రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తను పంచాయతీ సిబ్బందితో తొలగింపజేశారు. ఈ సందర్భంగా జీపీ కార్యదర్శి మాట్లాడారు. హోటల్ యజమానులు, ఇతర వ్యాపారులు చెత్తను ప్లాస్టిక్ కవర్లల్లో తెచ్చి, రోడ్డు పక్కన పారబోయడం మంచిది కాదని హితవు పలికారు. అలా చేస్తే సంబంధిత వ్యక్తులను గుర్తించి, ఫెనాల్టీ వేస్తామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కట్టారు.. వదిలేశారు..



నిరుపయోగంగా విశ్రాంతి భవనం

- వృథాగా ‘విశ్రాంతి’ భవనం
- ప్రారంభించేది ఎప్పుడు?

మోమిన్‌పేట: రూ35 లక్షల నిధులతో పదిహేనేళ్ల క్రితం జిల్లా పరిషత్ విశ్రాంతి భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పుష్కరకాలానికి పైగా కొనసాగాయి. ఎట్టకేలకు రెండేళ్ల క్రితం పూర్తయ్యాయి. కానీ.. నేటి వరకు ఆ భవనాన్ని ఎవరూ వినియోగించకపోవడం శోచనీయం. వివరాలు ఇలా ఉన్నాయి. 15 సంవత్సరాల క్రితం మండల కేంద్రంలో విశ్రాంతి భవన నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందుకు జిల్లా పరిషత్ ద్వారా నిధులు సమకూర్చింది. నాటి నుంచి సుదీర్ఘ కాలం పాటు నిర్మాణ పనులు జరిగాయి. భవనం పూర్తయింది. కానీ వినియోగంలోకి తేవడంలో అధికారులు విఫలమయ్యారు. ఫలితంగా భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. పాడుబడిన బంగ్లాగా మారి, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ‘రూ.లక్షలు వెచ్చించి విశ్రాంతి భవనాన్ని కట్టి వదిలేశారు. నిర్మించడానికి చాలా ఏళ్లు పట్టింది. ఇక ప్రారంభించడానికి ఇంకెంత కాలం పడుతుందో’ అని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యానికి ప్రజాధనం వృథా అయిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, భవనాన్ని వినియోగంలోకి తెచ్చి, ఇతర ప్రభుత్వ కార్యకలాపాలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.